వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం



మాట్లాడుతున్న తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



మేము సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

- సీఎం జగన్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి
- దగాకోరు టీడీపీని తరిమికొట్టండి
- మేము సిద్ధం సభలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ పిలుపు

బీచ్‌రోడ్డు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని పార్టీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరు గాంధీ సెంటర్‌లో శనివారం మేము సిద్ధం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన అందించేందుకు వలంటీర్ వ్యవస్థను సీఎం జగన్ ప్రవేశపెడితే.. టీడీపీ అధినేత చంద్రబాబు తన కుట్రతో వలంటీర్లను పనిచేయకుండా చేశారన్నారు. ఇటువంటి దగాకోరు టీడీపీని ప్రజలు తరమికొట్టాలని పిలుపునిచ్చారు. వెనకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తే.. దానిని ఈ కుటమి అడ్డుకుంటోందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

ప్రజలను పట్టించుకోని వెలగపూడి..

తూర్పులో ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి ఏనాడు నియోజకవర్గ ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవని ఎంవీవీ అన్నారు. ఈ ఐదేళ్లలో పార్టీలకు అతీతంగా తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని చెప్పారు. వార్డుల అభివృద్ధి కోసం విశేష కృషి చేసిందన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగలేదన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకొని జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఎంవీవీ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్, మండల అధ్యక్షుడు మువ్వల సురేష్, కిరణ్ రెడ్డి, అల్లంపల్లి రాజబాబు, జి.వి.రామచంద్రరావు, అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఓటేయండి

- వైఎస్సార్‌సీపీ 'తూర్పు' ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యానారాయణ
- 19వ వార్డులో విస్తృత ప్రచారం



19వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీకి హారతులు పడుతున్న స్థానికులు

ఎంవీపీకాలనీ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లుగా అందించిన ప్రజా సంక్షేమ పాలనను చూసి ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలని ప్రజలను విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కోరారు. 19వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఎంపీ ఎన్నికల ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 87వ రోజు 19వ వార్డు శివగణేష్ నగర్, వాసవానిపాలెం ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఎంవీవీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తూర్పు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. కొంత కాలంగా నియోజకవర్గంలోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తూర్పులో తనకు విజయాన్ని అందించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా ఎంవీవీకి ప్రతి ఇంటా ఓటర్లు నీరాజనాలు పలికారు. హారతులు పడుతూ స్వాగతించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెడ్‌క్రాస్ హోంలో కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పీడీ పాపునాయుడు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డు పెదవాల్తేరు దరి ఇండియన్ రెడ్‌క్రాస్ పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో వైద్య పరీక్షలు జరిగాయి. ముఖ్య అతిథి జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.పాపునాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో నిరాశ్రయులుగా మారిన వారికి సమాజం పూర్తి స్థాయిలో అండగా నిలవాల్సిన అవసరముందన్నారు. ఇలాంటి వారి అభ్యున్నతికి రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను కొనియాడారు. శిబిరంలో ఆయన కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హోంలో ఆశ్రయం పొందుతున్న 50 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రవికుమార్, విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్టీ, క్యాంప్ ఆర్గనైజర్ సాయికృష్ణ, హోం నిర్వాహకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య సంగీతార్చన

మద్దిలపాలెం: శ్రీవేంకటేశ్వర స్వామి అష్టోత్తర శత నృత్య సంగీతార్చన పేరిట నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఇసుకతోట వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అకాడమీ 33వ ప్రదర్శనలో భాగంగా లిపికారెడ్డి బృందం నృత్య, సంగీత గీతాలాపన చేశారు. అన్నమయ్య కీర్తనలు అద్భుతంగా ఆలపించారు. కార్యక్రమాన్ని ఆత్రేయ స్మారక పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి ప్రారంభించారు. లిపికారెడ్డి బృందం చేసిన నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఆర్.ఉగ్రనరసింహ ఆచార్యులు లిపికారెడ్డి బృందాన్ని సత్కరించారు. ఎం.వి.రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అకాడమీ వ్యవస్థాపకుడు కె.సత్యనారాయణరెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గోవిందా... గోవిందా



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడం, సెలవురోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తుల బారులు తీరారు. వేకువజామున సుప్రభాతసేవ, తోమాల సేవ అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అన్నమయ సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా సిక్కుల బైసాఖీ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న సిక్కులు

సీతమ్మధార: సిక్కుల ప్రధాన పండగ బైసాఖి(వైశాఖి) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇదే రోజున సిక్కు గురువు గురుగోబింద్ సింగ్ ఖల్సా స్థాపించిన సందర్భంగా సిక్కులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. గురుద్వారా జంక్షన్‌లోని గురుద్వారా సాధు సంగత్‌లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సాధు సంగత్ అధ్యక్షుడు ఆనంద్ సిక్కు గురువుల బోధనలను ఉపదేశించారు. సిక్కులు సంప్రదాయ దుస్తుల్లో గురుద్వారాను దర్శించుకుని ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఏయూ స్థలంలో అనధికార నిర్మాణం పరిశీలన



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన శివాజీపాలెంలోని మహిళా కళాశాల హాస్టల్ భవనాలు, డెల్టా స్టడీస్ కేంద్రాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతంలో అనధికారికంగా చేపడుతున్న భవన నిర్మాణాన్ని శనివారం ఉదయం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పరిశీలించారు. ఏయూ స్థలంలోకి చొచ్చుకొని వచ్చి భవన నిర్మాణాలు జరుగుతున్నాయని యూనివర్సిటీ ఇంజినీర్ ఫిర్యాదు మేరకు ఆయన వివాదాస్పద స్థలానికి వెళ్లారు. ఏయూకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి గోతులు తవ్వడాన్ని రిజిస్ట్రార్ స్వయంగా గమనించారు. దీనిపై సదరు భవన నిర్మాణదారుడిని ప్రశ్నించారు. అక్కడి నుంచే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సంబంధిత నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముందుగా సర్వే జరిపి హద్దులు నిర్ణయించుకున్న తర్వాతే భవన నిర్మాణం ప్రారంభించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనికి విరుద్ధంగా సర్వే జరపకుండా ఏయూ స్థలాన్ని ఆక్రమిస్తూ నిర్మాణం జరుగుతోందని తమకు సందేహం కలుగుతోందన్నారు. వెంటనే నిర్మాణ పనులను ఆపివేయాలని భవన యజమానికి సూచించారు. ఏయూ స్థలంలో వేసిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని రిజిస్ట్రార్ ఆదేశించారు. దీనిపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గతంలోనే సదరు స్థలానికి సంబంధించి సర్వే జరిపించాలని యూనివర్సిటీ ఇంజినీర్ సూచించారని, దీనిని అమలు చేయకుండా భవన యజమాని నిర్మాణ పనులకు దిగడం సరైనది కాదన్నారు. దీనిని ఉల్లంఘించి పనులు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భవన యజమానితో అన్నారు. రిజిస్ట్రార్ వెంట యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు



మూల్యం నాటికలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. తొలి ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్ అసోసియేషన్ వారి మూల్యం నాటిక ప్రదర్శించారు. నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల ఇతివృత్తంగా ఈ నాటిక అద్భుతంగా సాగింది. కథాంశానికి తగ్గట్టుగా నటీనటులు వారి నటనతో కట్టిపడేశారు. అనంతరం కత్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ వారిచే విముక్తి నాటిక ప్రదర్శించారు. యువత నేటి తరంలో మత్తుకు బానిసలై ఉజ్వల భవిష్యత్‌ను ఎలా పాడు చేసుకుంటున్నారో కళ్లకు కట్టినట్టుగా చూపించి అందరి ప్రశంసలు పొందారు. ఈ ప్రదర్శనలను వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, రాంబాబు, నాటకలకు ఆర్థిక సాయం అందిస్తున్న పైడా క్రిష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

విద్యతోనే సమానత్వం



వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: విద్యతోనే సమాజంలో ప్రజల సాధికారత, సమానత్వం సాకారమవుతాయని ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ శోధ్‌పీఠ్, ఉన్నతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్, రేడియంట్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సంయుక్తంగా ×విద్య, సామాజిక న్యాయం, సాధికారతలపై డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఆలోచనలు× అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో శనివారం వర్చువల్ విధానంలో ఆయన పాల్గొని కీలకోపన్యాసం అందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ దేశం ఆర్థికంగా బలోపేతం కావడానికి పారిశ్రామిక ప్రగతి, యాంత్రీకరణ అవసరమని భావించిన తొలి వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. నేడు డిజిటల్ ఇండియాతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం సేవలు చేరువయ్యాయన్నారు. ఆదాయాన్ని అందించే న్యాయవాద వృత్తికంటే ఎకనామిక్స్‌ను అభ్యసించడానికి అంబేడ్కర్ ఆసక్తి చూపడం ఆయన దేశభక్తికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ పరంగా విద్యకు ప్రాధాన్యం పెరుగుతోందని చెప్పారు. అన్ని వర్గాలకు విద్యను అందించడం, తద్వారా దేశాభివృద్ధిని సాకారం చేసే దిశగా ప్రభుత్వాలు దశాబ్దాలుగా కృషి చేస్తున్నాయన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ చైర్ చేస్తున్న సేవల పనితీరు వంటివి సభికులకు వివరించారు.

వన్యప్రాణులకు ఉపశమనం



కమ్మల పాకల నీడలో సేదతీరుతున్న కణుజులు

ప్రత్యేక ఏర్పాట్లు చేసిన జూ అధికారులు

ఆరిలోవ: ఎండలు దంచి కొడుతున్నాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటు మనుషులే కాదు.. అటు జంతువులు సైతం ఎండ వేడికి అల్లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో అధికారులు వేసవి నుంచి జంతువులు, పక్షులకు ఉపశమనం కలిగించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అడవి దున్నలు, కోతులు, కనుజులు, జింకలు, పులులు, సింహాలు, ఎలుగుబంట్లు, తదితర జంతువుల తిరిగే ఎన్‌క్లోజర్లలో ప్రత్యేకంగా తాటి కమ్మలతో పాకలు నిర్మించారు. వాటి కిందకు వన్యప్రాణులు చేరి సేదతీరుతున్నాయి. ఇంకొన్ని ఎన్‌క్లోజర్లలో చెట్ల నీడలోనే ఉపశమనం పొందుతున్నాయి. ఎండ తీవ్రత వల్ల వాటిలో హుషారు తగ్గిపోయింది. యానిమల్‌కీపర్లు అందిస్తున్న ఆహారాన్ని తింటూ.. నీడలోనే ఎక్కువ సమయం గడుపుతున్నాయి.



పాక నీడలో బబూన్ కోతులు

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్

సీతమ్మధార: వాహన చోదకులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లు వాహనాలు నడపరాదని ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు శనివారం ద్వారకానగర్‌లోని ఎసెంట్ కళాశాలలో ×భద్రత× అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైంలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. 18 ఏళ్లు నిండిన తరువాత లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని సూచించారు. టూ వీలర్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సిగ్నల్ పాయింట్ వద్ద రెడ్ లైట్ వెలిగినప్పుడు ఆగాలని, గ్రీన్ లైట్ వెలిగినప్పుడు ముందుకు వెళ్లాలని సూచించారు. రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. బ్యాంకు అధికారులమని చెప్పి ఫోన్ కాల్స్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పరాదని, బ్యాంకు అధికారులు ఎవరూ ఫోన్ చేసి వివరాలు అడగరన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.వి.భాస్కరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలకు ఆహ్వానం



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజశేఖర్

సీతంపేట: మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ సారథ్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో పోటీల పోస్టర్‌ను ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ నెల 29న అంతర్జాతీయ నృత్యప్రదర్శన దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రీయ, జానపద నృత్యం, సినీ గీతాలాపన, సంగీత పరికరాల వాద్యం, డ్రాయింగ్, పెయింటింగ్, చిన్నపిల్లలకు విచిత్ర వేషధారణ, పెద్దలకు వస్త్రాలంకరణ వంటి పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు మహమ్మద్ షకీల్ తెలిపారు. పాల్గొన దలచిన వారు ఈ నెల 25లోగా వాట్సాప్ నంబర్ 99664 85335లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు.

మహోదాత్త మహిళ సీతాదేవి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న సీతారామ కళ్యాణ వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం పీఠం దర్బారు హాల్‌లో విశాఖ సాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని రామాయణంలోని సీతాదేవి పాత్రపై ప్రవచనం చేశారు. సీతాదేవి మహోదాత్త మహిళని, రావణ సంహారం కోసమే ఆమె జననం జరిగిందని, సీతారాముల దాంపత్యం లోకానికి ఆదర్శప్రాయమన్నారు. వాల్మీకి చిత్రించిన సీతాదేవి పాత్రలోని భిన్న కోణాలను ఆవిష్కరించారు. రామాయణ కల్పవృక్షంలోని పద్యాలను ఉదహరిస్తూ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. డాక్టర్ డి.వి.సూర్యారావు, కందాల కనక మహాలక్ష్మి, రాంభట్ల నృసింహశర్మ, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

జనచైతన్య మండలి పాటల సీడీ ఆవిష్కరణ

సీతంపేట: జనచైతన్య మండలి నలభై ఏళ్ల ఉద్యమ ప్రస్థానం, బీఆర్ అంబేడ్కర్ జయంతి ని పురస్కరించుకుని రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం అంబేడ్కర్ బౌద్ధ చైతన్య భావజాల గీతాల సీడీ ఆవిష్కరణ జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు పెయ్యల పావనప్రసాద్ రాసిన గీతాలకు సంగీత దర్శకుడు జాన్ సంగీతాన్ని సమకూర్చారు. సీడీలో 16 పాటలను పలు సంఘాల నాయకులు ఆవిష్కరించారు. పి.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హూదూరు సీతామహా లక్ష్మి, దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ, రచయిత బండి సత్యనారాయణ, దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి బూసి వెంకటరావు, పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి



హెచ్‌బీ కాలనీ రజక వీధిలో ప్రచారం చేస్తున్న తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణలను అఖండ మెజారిటీలతో గెలిపించాలని పార్టీ తూర్పు ఎన్నికల పరిశీలికుడు మొల్లి అప్పారావు కోరారు. 16వ వార్డు హెచ్‌బీ కాలనీ, రజక వీధి, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలంటే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, ఎంవీవీ సత్యనారాయణలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను మొల్లి అప్పారావు కోరి కరపత్రాలను అందజేశారు. ప్రచారంలో పార్టీ వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

28వ వార్డులో ఇంటింటి ప్రచారం



28వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ

బీచ్‌రోడ్డు: ఐదేళ్లుగా ప్రజా సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయాలని ప్రజలను 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ కోరారు. వార్డులో శనివారం ఆమె కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి గడిచిన ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సంపంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన అంగోలా ప్రతినిధులు



ఏయూ వీసీతో సమావేశమైన అంగోలా ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అంగోలా దేశ దౌత్య కార్యాలయ సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. తమ దేశ విద్యార్థులకు ఏయూ అందిస్తున్న విద్య విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఏయూతో తమ అనుబంధం మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎంబసీ ఆఫ్ రిపబ్లిక్ ఆఫ్ అంగోలా వీసీ కాన్సులర్ జె.ఏ ఫ్రాన్సిస్కో, కౌన్సిలర్ అఫోన్స్ జోస్‌తో కూడిన బృంద సభ్యులు ఏయూలో విద్యనభ్యసిస్తున్న అంగోలా దేశ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఏయూలో కల్పిస్తున్న వసతులు, బోధన తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏయూలో నాణ్యమైన విద్యను అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శని వారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.